౧

శంప తెలివితేటలుగల చేటి. అది సంకర జాతులలో వివాహములు కుదుర్చును. దానిబంధము ముందు,సూత్రబంధము పిఱుంద.

కులీనులయిన బీదవారి యిండ్ల తనకు వధువును విచారించిపెట్టుమని అకులీనుఁడు శంపకు లోఁగడ చెప్పియుంచెను.

సూర్యుఁడు అస్తమించిన పిదప లక్కి-- ఇంటితోఁట-కట్టవకడ తనతో కలిసికొని మాట లాడ రమ్మని శంప అకులీనునకు వార్త పుచ్చెను.

అకులీనుఁడు రాజగృహమునకు పంప వలసిన పదార్థముల నన్నింటిని బంటులకు ఇచ్చి వడిగా పంపివైచెను.

కనకలత పూలచే చక్కగా అలంకరించు కొనెను. నడువఁగల చంద్రకాంత చిత్రము వలె గృహోద్యానములోనికి పరిక్రమించెను. కనకలతను గృహోద్యానలత లన్నియు నిశ్చలములై చూచుచుండెను. కనకలత కానిపించు వన దేవత కాఁబోలు.

లతలకు కనకలత ఇచ్చినరాగము కంటె సంధ్య ఎక్కువరాగ మీయలేక పోయెను. చంద్రకాంత పుష్పములు చంద్రుని దెసకంటె కనకలతాముఖముదెసనే ఎక్కువ మ్రొగ్గెను.

అకులీనుఁడు కట్టవబయట నిలువఁబడి యుండెను. శంపకొఱకు చూచెను. అతనికి ఉద్యానమున నడయాడుచుండిన కనకలత కానిపించెను.

కనకలత ఒకతూరి మోమెత్తి చంద్రుని చూచెను. అకులీనుఁడును చూచెను. అతఁడు చంద్రుని చూడక కనకలత - ముఖమునే చూచెను.

కనకలత ఎత్తినమోము వాల్చి అకులీనుని మోము కాంచి మరి చంద్రుని చూడ లేదు.

తాను చూచుచున్నటులు కనకలత ఎఱుఁగదు; తాను చూచుచున్నటులు అకులీనుఁ డెఱుఁగఁడు.

సౌందర్యము స్త్రీయందే పరినిష్ఠిత మని అకులీనుఁడును, పురుషునియందే పరినిష్ఠితమని కనకలతయు అనుకొనిరి.

కనకలత కొంచెము పరిక్రమించెను. అకులీనుఁడును పరిక్రమించెను. రెండుఛాయలును కలిసికొనెను.

ఇంటిలోపలి నుండి లకుమ కంచుకుత్తుకతో-కనకలతా! ఎంతసే పక్కడ? రా లోనికి రా!-అని అఱచెను.

కనకలత మెడ మలఁచి చూచుచు లోనికి మెల్ల మెల్లగా వెళ్లెను.

అకులీనుఁడు కను లొక్క-కన్నుగా కన్నొక్క-చూపుగా చూచెను. ఆచూపుల ఆకర్షణమునఁ గాఁబోలు, కనకలత వడిగా లోనికి వెళ్లలేక పోయెను.

అకులీనుఁడు తన వెనువెనుక శంపను చూచి ఉలికి పడెను.

శంప—ఉలికి పాటేల?

అకులీనుని మోము కొంచెము మూసెను. చెమరింపలేదు కాని వేఁడి యెక్కెను. అతనికి ప్రత్యుత్తరము తోఁపలేదు. అది యటుండె, సంభాషణమునకు ఆరంభము కానిపింపలేదు.

శంప—నేను కొంచె మాలస్యముగా వచ్చితిని, క్షమింపవలయును.

అకులీనుఁడు కోలుకొనెను. 'మంచిది; తొందర యేమియు లేదు లే.'

శంప—నేను నేఁడే తిరిగి తిరిగి వచ్చితిని.

అకు—మంచిది.

శంప—విశేషములు తెలుప నక్కఱ లేదా?

అకు—అక్కఱ లే కేమి?

శంప—సావధాను లేనా?

అకు—ఔను.

శంప—నెల్లూర సిద్ధ శ్రేష్ఠి కూఁతురు ఉన్నది. పిల్ల కొంచెము చామనచాయ. కన్నులు కాటుక పిట్టలు.

అకు—పిట్టలు మనుష్యుల కేల?

శంప—ప్రొద్దుటూరున సెనగల రామమ్మపిల్ల. పిల్ల మోమున ప్రతిబింబము చూచికొనవచ్చును.

అకు—అద్దములు లేవా?

శంప—గూడూర బద్దెమ్మ కూఁతు: వెల నాలుగు వేలు. ఇంకొక వేయికూడ పెట్టనగును.

అకు—బేసి సరిపడదు.

శంప—చందవోలులో—

అకు—ఈయూర నెవరును లేరా?

శంప—నా యెఱుకలో పెండ్లికి తగువారు లేరు.

అకులీనుఁడు ఉద్యానముమీఁదుగా లకుమ-యిల్లు చూపించెను.

శంప తనపన్నాగము పాఱినదని సంతసించెను. ఆలోచించినటులు ఆలోచించి 'లకుమయా?' అనెను. అకులీనుఁడు వికారముగా నవ్వెను. శంప 'కనకలతయా?' అనెను. అకులీనుఁడు చూచుచు ఊరకుండెను. శంప 'మంచిది' అనెను.

౨

లకుమాదేవి అద్దంకి మహారాజుగారి ఉంపుడుకత్తె. మహారాజ్ఞికి విసము పెట్టినదని తేలుటచే నగరినుండియే కాక మహారాజు మనస్సునుండియు వెళ్లఁగొట్టఁబడెను. లకుమాదేవి వెంటనే లకుమ యాయెను. పిదప లక్క-

మ్మ ఆమెను. తరువాత లక్కి యామెను. ఇపుడు-లక్కి.

లక్కికి పదునెనిమిదేండ్ల యీడుగల కూఁతురు ఒకతె కలదు. అది కన్నకూఁతురు కాదు, కొన్నకూఁతురు.

దానిపేరు కనకలత.

కనకలత చిన్నపుడు గ్రుడ్డిది. లకుమ అనేక వైద్యులచే పలుపాట్లుపడి బాగుచేయించెను. ఆవిశ్వాసముచే కనకలత లకుమలో తల్లిని చూచెను.

కనకలత యిపుడు పద్మాక్షి.

కనకలత పాడుచో కోయిలలు ఆలకించును. అభినయమున అందె వైచినది. అది అర్థము చెప్పఁబూనుచో పదములు కరఁగిపోవును. నగరమునందలి సుందరపురుషుల నందఱను ఒకసారి కనఁగోరితివా, కనకలత పాట పెట్టింపుము.

సుందరులైన ఎల్లప్రాయమువారు దాని రూపము చూడఁగోరి వచ్చి, పాపము, సంగీత మాధుర్యముచే తన్మయులై వంచితులగుచుందురు; గానము వినఁగోరువారు రూపముచే మోసపోవుదురు.

కనకలతాసౌందర్యగీతములు మాయామోహములు; సంగీత సౌందర్యములు మోహమాయలు.

కనకలతను యువరాజునకు ఉపపత్నిని చేయవలయు నని లక్కి కోర్కి కాని యువరాజు వార్త పంపెను—కనకలత చెల్లెలివావి అని.

లక్కి అనెను— వారాంగనకు వావియేమి? అసలు వావి యేమి? శ్రీకృష్ణుఁడు భగవంతుఁడు - స్రష్ట - రక్షకుఁడు - నాశకుఁడుకదా! ఆయన పెండ్లాడిన వారందఱు ఆయనచే సృజింపఁబడిన వారేనా? బ్రహ్మకు సరస్వతి యేమివావి? తురుష్కులకు క్రైస్తవులకు ఎట్టివావులు? యువరాజు వెఱ్ఱివాఁడు.

కనకలత కొంచె మాలోచించి, లోలో నవ్వుకొని—వావిలేదా? అతఁడు అన్నవావి కాదా?-అనుకొనెను.

రాజభయము తీఱినది. లక్కి కనకలతకు ఆదేశించెను—"ఎవరినైనను సరే 'బావా'అని పిలువుము" అని.

ధనికులొకరొక్కరే తమకుఁ దాము మేము మే మని కన్నెఱికమునకు వార్త లంపసాగిరి. లక్కి- సేనాపతి లకుమయ్య కుమారుఁడు రాజన్నను ఏఱెను.

కనకలత—'సేనాపతిగుండెరాయి. వానికి దినదినగండము. రేయుంబవళ్లు కొలువు'అనెను.

'అన్నివిధముల అటువంటివాఁడే మనకు అపేక్షితుఁడు. విశేషించి అతఁడు బ్రాహ్మణుఁడు. బ్రాహ్మణపూజ మనకు ప్రథమ కర్తవ్యము. పిదప ఇతఁడెల్లకాల ముండునా? ఇతఁడు కన్నెఱికపు మగఁడే.'

కన—సర్వకాలము ఉండఁడా?

'జగత్తంతయు మాయ'అన్నటులు నవ్వి, లక్కి- 'నీవు సానివా, సంసారివా?'

కనకలత ఆలోచించెను.

లక్కి—పోనీ! జయపాల-

కన—సరే.

లక్కి—విత్తగుప్త?

కన—సరే.

లక్కి—రామదాసు?

కన—సరే.

లక్కి మరి యేఁబది పేరులు చెప్పెను. కనకలత ఏఁబదిసరేలు చెప్పెను.

లక్కి-'భేషు! నీవిపుడు సానివి'అని 'అకులీన?' కనకలత ప్రత్యుత్తరము చెప్పలేదు.

అందఱిలో అకులీనుఁడు ధనికుఁడు. కులగోత్రహీనుఁడు కావున అవివాహితుఁడు. మహారాజుగారి మోదీ.

3

శంప లకుమకు అకులీనుని అభిప్రాయము చెప్పెను.

లకుమ ఆలోచించి ఆలోచించి అంగీకరించెను. కన్నెఱికపు ఖరీదు రెండువేల నూట పదార్లు. చిల్లర మల్లరలు అయిదు నూర్లు.

కన్నెఱికమునకు లగ్నము తొందరలో పెట్టవలసినదని లకుమ జ్యోతిష్కుని కోరెను. ఒకనెలలో సుముహూర్తము కుదిరెను.

లకుమ సర్వసన్నాహములు చేసెను.

అకులీనుఁడు అయిదువందలు సంచకరము పంపెను.

కనకలతకు దైనందినము స్వప్నములే.

శంప రాత్రి పనిపాటలు చేయుచు లకుమను కంపస్వరముతో పిలిచెను. లకుమ శంప కడకు పరుగిడెను. శంప తల ఒకప్రక్కకు ఓరగా ఎత్తి, తర్జనిని వెనుకకు చూపి—'ఆలకింపుము! ఆధ్వని! బందిపోటు!'

లకుమ గుండెలలో రాయి పడెను. కనకలతను పిలిచెను.

కనకలత ఆలకించి—'అది సేనాపటహధ్వని. నెలక్రింద మనరాజుగారి సేనలు సరిగా ఈదారినే వెళ్లినవి.'

శంపయు, లకుమయు ఔనౌ ననిరి; వారివారి పనులలోనికి వెళ్లి పోయిరి.

అర్ధంకిసేనలు తురుష్కసేనల జయించి వచ్చుచున్నవి. విజయోన్మాదముచే సేన తాండవించుచుండెను. సేనామార్గమునందలి తోఁటలను చూచినచో అలనాఁటి మధువనము గుఱుతు వచ్చుచున్నది. బంటు లెలుఁగుబంటులవలె తాళ్లెక్కి కల్లు త్రావిరి. గ్రామములు కొల్లఁగొట్టిరి. ఆ సేన వర్షాకాలపు సెలయేఱువలె అన్నింటిని ముంచి పాఱెను.

కనకలత శంపాలకుమలవలె ఇంటిలో కూరుచుండలేదు. దాని యౌవనరక్తముత్కంఠచే ఉచ్ఛ్వసించెను. తలుపు తెఱచి అఱ్ఱెత్తి చూచెను.

మూలబలము గంభీరముగా నడచిపోయెను. కూటువమూఁక వచ్చెను.

ఒక సైనికుఁడు మరొకనినిగిఱి-'ఓసీ, అదిగో-గృహచంద్రిక!'

మరొకఁడు—గ్రామచంద్రిక.

వేఱొకఁడు—దేశచంద్రిక.

ఇఁకొకఁడు—ఇంతపెద్ద పేరేమిటిరా? ఊరబసివి అనరాదూ?

ఒకఁడు కనకలతకు సైగచేసెను. ఇంకొకఁడు రమ్మని పిలిచెను. కొండొకఁడు కనకలతకేసి రెండడుగులు పెట్టెను. ఒకఁడనెను—'సేన నంతయు పోనిమ్ము-మనము పదుగురము దళపతితో మిగులుదము' అనెను. సేన యంతయు నడచిపోయెను. కనకలత వాహిని ముందరికి ప్రవహించుట చూచి లోపలికి వెళ్లి తలుపు మూసెను. కనకలత చేతిని ఒకబలిష్ఠమగు చేయి పట్టుకొనెను.

రాజుగారిచే బహివెట్టఁబడినది కావున సైనికులకు లకుమ యనిన 'నల్లేరుపై బండి.'

దళపతి ఆజ్ఞచే శంపను ఒకమూల, లకుమను ఒకమూల కట్టివైచి నోట గుడ్డలు గ్రుక్కిరి. కనకలతను దళపతి పట్టుకొనెను.

నగనట్ర దోచుకొనిరి. అకులీనుని బజానా అయిదునూఱులు అపహరించిరి. గంతలు కట్టి కనకలతను కాఁజేసిరి.

కనకలతయు, సగముద్రవ్యమును దళపతివంతు; శేషము సైనికులవంతు.

మఱునాఁడు శంప చావు తప్పి కన్నులొట్టపోయి దళపతి దండనాయక సేనాపతులతో మనవి చేసికొనెను.

దళపతి అనెను—'ఎవరికి చెప్పకుము. నేను కనకలతను ద్రవ్యమును పట్టుకొందును.'

దండనాయకుఁడనెను—'నాదిభారము. ఇంకొకరికి తెలిపినచో సొమ్ము నీది కాదు.'

సేనాపతి అనెను—'పొక్క నీయకుము. పట్టి యిత్తును. వెళ్లడించితివా, ఏదియు నీకు దక్కదు.'

౪

మఱునాఁటి నడికిరేయి దళపతి అలంకరించుకొని ఒకచీఁకటికొట్టు తలుపు తెఱచెను. ఆచీఁకటిలో కనకలతయే దీపము. దళపతి లోనికేఁగి తలుపు మూసెను. ఆజీవద్దీపము నిగళబద్ధమయి యుండెను.

కనకలత అనెను— 'నిన్నటి నుండియు నాకు ఉపవాసము; వాసము చీఁకటికొట్టు. నన్ను నేఁటి కింటికిఁ బంపుము. రేపటిరేయి నీకు ఎదురుచూతును. అక్కడ పట్టుపానుపు; చంద్రదీపిక; పూలతావి; దేశ కాలములు సాక్షులు. ఇచట అధర్మము, ఎవరు చూచినను. మాయింట సర్వము ధర్మము.'

దళపతి ఆలోచించెను. 'మంచిది' అనెను. మరల ఆలోచించెను. 'నిన్నొకతూరి కౌఁగిలింతును' అనెను.

కనకలత ఒడలు జల్లుమనెను—'నీకు నేను చెల్లెల నగుచో?'

దళపతి అనెను—'భోగముదానికి వావి యేమి?'

కనకలత మనస్సు కలుక్కు మనెను.

దళపతి కౌఁగిలిఁ గొనఁబోయెను.

కనకలత—'ప్రేమ నిర్బంధముచే క్రుళ్లును' అనెను. దండనాయకుఁడు బయట విసురుగా తలుపు తట్టెను.

దళపతి తలుపు తెఱచి—'తమ కొఱకే ఎదురుచూచుచున్నా' ననెను.

దండనాయకుఁడు లోపల ప్రవేశించెను. దళపతి నిష్క్రమించెను. దుర్గముయొక్క ఒక కవాటము కూలెను.

కనకలత అనెను—'నన్ను నేఁ డింటికిఁ బంపుము. రేపురేయి నీ కొఱకు నిరీక్షించుచుందును.'

దండనాయకుఁడు వల్లె యని అనెను—'ఒక ముద్దు బజానా.'

కనకలత అనెను—'నీవు నాకు అన్న వగుదో?' దండనాయకుఁ డనెను: 'ఓహో, భోగముదానికి వావి?'

కనకలత మనస్సు ఉస్సు రనెను.

దండనాయకుఁడు ముద్దాడఁ బోయెను. కనకలత అనెను—'బలాత్కారమున ప్రేమ జుగుప్స.'

సేనాపతి తలుపు గొట్టి దండనాయకుని పిలిచెను. దండనాయకుఁడు తలుపు తెఱచి, 'తమరినే స్మరించుకొనుచున్నాను?' అనెను.

సేనాపతి ప్రవేశించెను. దండనాయకుఁడు నిష్క్రమించెను. దుర్గపు రెండవ కవాటము కూలెను.

కనకలత అనెను—'తమకొఱకు రేపటి రేయి వేచి యుందును.'

సేనాపతి అనెను—'నిన్ను నేఁ డింటికిఁ బంపి వైతునా ?'

కనకలత 'చిత్తము' అనెను.

సేనాపతి శృంఖల విప్పెను. ఒక్కసారి కౌఁగిలించుకొనెను. కనకలత విదిలించుకొని-'శాసనముచే ప్రేమ క్రోధ మగును' అనెను.

అకులీనుఁడు తలుపు పగులునటులు కొట్టి—'రాజాజ్ఞ అయినది; తలుపు తెఱువుము' అని గద్దించెను.

సేనాపతి కుక్కినపేను - తలుపు తెఱచెను. దుర్గపు కవాటము లన్నియు కూలెను.

కనకలత అనెను—'ప్రేమయొక్క కృష్ణపక్షము చూచితిని.'

అకులీనుఁడు కనకలతను చూచెను; కనకలత అకులీనుని. కనకలతకు కన్నీరు ఉరిలెను. అకులీనుఁడు కను లొత్తుకొని ఇరువురు రాజభటుల నిచ్చి కనకలతను ఇంటికి పంపెను. సేనాపతి నడుఁకుచు నడుఁకుచు ఇంటికిఁ జనెను. అకులీనుఁడు కనకలతను చూచుచు వెళ్లెను.

౨

కనకలతతో పాటు పోయిన ద్రవ్య మంతయు లక్కి యింటికి చేరెను.

లకుమ అకులీనునకు జయవెట్టెను. శంపయు. 'కీర్తింప సమర్థురాలను కాను' అని కనకలత తలఁచెను.

'తొలుత పెట్టిన ముహూర్తము బలవత్తర'మని పురోహితుఁడు ప్రస్తావించెను.

ముంజూరులకు చిలుకల పంజరములు వ్రేలఁడీయఁబడెను. కపోతముల గూండ్లు క్రొత్తలాయెను. అమరుకము బల్లపై అమర్పఁబడెను. శృంగార చిత్రములు గోడల నిలిచెను. పానుపు పటగృహ మాయెను. ఉద్యానమంతయు లతావృక్షములచే నవీనప్రియులను భరించెను. కనకలతను శంప అలంకరించెను. పిదప లకుమ దిద్దెను. పిదప కనకలత నిలువుటద్దమున అలంకారము చూచుకొనెను. అంతయు తీసివైచెను. తానే అలంకరించుకొనెను. అలంకారము పరతంత్రము కాదు.

సంధ్య కనకలతకు లత్తుక పూసెను. నక్షత్రములు అక్షింతలు చల్లెను. చంద్రుఁడు తిలకము దిద్దెను.

పురోహితుఁడు వచ్చి ముకురదర్శనము చేయించెను.

అకులీనుని గుమాస్తా లకుమకు రూపాయల సంచులు అప్పగించెను. లకుమ లెక్కించుకొనుచు కూరుచుండెను. శంప కంట వత్తిడుకొని మాఱనివానిని ఏలుచుండెను.

పేడి బాపిగాఁడు రతీవేషము తాల్చెను. నూచకమ్మ మంగి మన్మథవేషము వేసెను. చేటులు,విటులు, కుట్టనులు, నటులు కామవీర జయంతిక కట్టిరి.

కన్నెఱికములచే కాలము తీఱిన విటులు తాంబూలములు పుచ్చికొనిరి. కనకలత త్రావిన పాయసము అకులీనుఁడు త్రావెను. అకులీనుఁడు త్రావిన పాయసము కనకలత త్రావెను.

ప్రాయపువారు పాటలు పాడిరి.

కుందిగాఁడు హాస్యము చెప్పెను.

పురోహితుఁడు కట్నము కైకొని నడిచెను.

ముత్తైదువలు రైకలు గొనిపోయిరి.

శంప కనకలతచెవులు కొఱికి వెళ్లెను.

లకుమ స్వయముగా తలుపులు వైచి బయట గొళ్లెము పెట్టెను.

కనకలత చేతులు జోడించి అకులీనునితో అనెను— 'నన్ను రక్షించినందులకు నీ కీఁదగినది నాకడ ఏదియు లేదు.'

అకులీనుఁ డనెను—'నావస్తువును నేను రక్షించుకొంటిని.'

'అటు లగుచో నన్ను వివాహమగు' మని కనకలత అనెను.

అకు—వారాంగనకు వివాహమా?

కనకలత మృదువుగా అనెను—'నేను అసలు వారాంగనను కాను.'

అకు— నీ వెవతెవు?

కనక—మాఅమ్మ నన్ను అమ్మట మాత్ర మెఱుఁగుదును.

అకు—అదియు భోగముది కాదని నీ కెటులు తెలియును?

కన—ఆసంగతి నా కేల? నేను మాత్రము కాను.

అకు—నీవతమున ఒకమచ్చ ఉన్నదా?

కనక—'ఉన్నది' అనుచు అకులీనుని మోము చూచెను.

అకు—(తల వంచి) ఏల ఆమచ్చ?

కనక—మా అన్న కాల్చెను.

అకు—అతఁ డేచట?

కనక—లకుమ అనుమానముగా చెప్పెను—చచ్చెనని.

అకు—'ఈదౌర్భాగ్యుఁడే నీయన్న. నీకు బాల్యమున కనులు లేవు. నాకు కను లుండియు లేవు.' అనెను.

కామన కాలిపోయెను. వాసరశయ్య మాతృగర్భశయ్య యాయెను. వాత్సల్యము ప్రవహించెను.

కనక—'ఎంత పశువులము? ఇంద్రియ ప్రేమ ఎంత అమావాస్య? ఎంతటి మాయా ముకురము?

'వావి యేమి? ప్రేమ యేమి? విధి యేమి? నిషేధ మేమి? సృష్టిలో దారి డొంక లున్నవా? మానవవాసన ఈయరణ్యమును నలికి ఇంద్రియోపభోగమునకు ఎన్ని వావులు, ఎన్ని విధులు, ఎన్ని నిషేధములు, ఎంతెంత కూర్చి ఎన్ని కోటలు కట్టినను, ఒక్క-చింతాయంత్రముచే చిందఱ వందఱ యయి పోవును.

'అంతయు గుంటచిక్కు. అన్నా! ఏది దారి?'

అకులీనుఁడు ఉద్యానముదెస నున్న దారి తెలిచి—'ప్రేమ దేని యణువో, వావివరుసలు దేని పయిపూఁతలో, సృష్టి యెవరి యేకగర్భమో విచారించుటకు కావలసినంత దారి దొరకినది. ఆవలికి వెళ్లి విచారించుటకు ముందు ఇది దారి; తరువాత ఆలోచించు కొనుటకు అనంత మైనబుద్ధి.' అని ముందు నడిచెను. కనకలత వెనుక నడిచెను.

గాంధిమహాత్ముఁడు

న్యాయపతి వెంకట విజయలక్ష్మమ్మ గారు
[బ్రహ్మపుర మహిళాసభ]

ఏపుణ్యభూమిలో నేప్రొద్దు దేవతాతతి సమర్చనలచేఁ దనియుచుండు
ఏదివ్యదేశమం దెలమి నారాయణుం డవతరించు నధర్మహరణలీల
నేమహాసీమలో నేవేళ ఘనవేదశాస్త్ర పురాణనిస్వనము వెలయు
నేపావనస్థలం బేపారుభారతీదేవి విహారంపుఁ బూవుఁదోఁట